

వైద్యులకు రక్షణ కల్పించాలి

రోగులకు మెరుగైన సేవలందించే డాక్టర్లకు ప్రభుత్వం రక్షణ కల్పించాలి. కోల్‌కతాలో వైద్యురాలిపై హత్యాచార ఘటనకు కారకులైన ప్రతి ఒక్కరినీ శిక్షించాలి. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేసే వైద్యులకు భద్రత కల్పించేందుకు స్పెషల్ పోలీస్ ప్రొటెక్షన్ ఏర్పాటు చేయాలి.

– డాక్టర్ చిన్నారావు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్, రంగంపేట మండలం



దోషులను కఠినంగా శిక్షించాలి

కోల్‌కతాలో వైద్యురాలిపై హత్యాచార ఘటన దిగ్భ్రాంతికి గురిచేసింది. ఇలాంటి ఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా దోషులను కఠినంగా శిక్షించాలి. వైద్యసేవలే పరమావధిగా విధులు నిర్వహిస్తున్న వైద్యులపై దాడికి పాల్పడుతున్న వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించకూడదు. ఆస్పత్రుల వద్ద పూర్తి స్థాయిలో సెక్యూరిటీ గార్డులు, నైట్ వాచ్‌మెన్‌లను నియమించాలి. ప్రభుత్వాలు కఠిన చట్టాలు అమలు చేయాలి.

– సోమిరెడ్డి శిరీష, వైద్యాధికారి, సంపర పీహెచ్‌సీ, పెదపూడి మండలం



ఊరంతా జ్వరాలే..

- విజృంభిస్తున్న సీజనల్ వ్యాధులు
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు
- క్లస్టర్ పరిధిలో పీహెచ్‌సీలు కిటకిట



కోరుకొండలో సేవలందిస్తున్న వైద్యులు



పురుషోత్తపట్నంలో గత ప్రభుత్వంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం (ఫైల్)

మధురపూడి: ఏ నోట విన్నా.. ఎక్కడ చర్చించుకున్నా జ్వరాల మాటే. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు జనాన్ని పట్టిపీడిస్తున్నాయి. వాతావరణంలో మార్పులు, గ్రామాల్లో పారిశుధ్య లోపం, సురక్షిత నీరు అందకపోవడం వ్యాధులకు కారకంగా మారుతున్నాయి. జలుబు, దగ్గు, జ్వరం, ఒళ్లు, తలనొప్పిలతో చాలామంది ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. రాజానగరం, అనపర్తి నియోజకవర్గాల్లో 138 గ్రామాల్లో మొత్తం 13 పీహెచ్‌సీలు ఉన్నాయి. అనపర్తి నియోజకవర్గంలో 58 గ్రామాలకు ఆరు, రాజానగరంలో 80 గ్రామాల ప్రజల కోసం ఏడు పీహెచ్‌సీలు ఏర్పాటు చేశారు. ఆయా పీహెచ్‌సీలకు ఓపీ సంఖ్య రోజూ 100 మందిపైగా ఉంటోంది. ఇందులో జలుబుతో 50 శాతం, దగ్గు, ఆయాసంతో, ఇతర రోగాలతో 50 శాతం మంది ప్రజలు వస్తున్నారు. వారికి వైద్యులు పరీక్షలు చేసి మందులు ఇస్తున్నారు. వైద్య ఆరోగ్య సిబ్బంది ఆయా గ్రామాల్లో సర్వే చేసి జ్వర పీడితులను గుర్తిస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రస్తుత కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేస్తున్నారు.

సదుపాయాలు లేక..

చాలా పీహెచ్‌సీల్లో సౌకర్యాలు లేవు. రోగుల సంఖ్య ఎక్కువవుతుండడంతో కూర్చునేందుకు సైతం కుర్చీలు ఉండడం లేదు. నాణ్యమైన మందులు ఇవ్వకపోవడంతో పాటు మందుల కొరతతో బయట కొనుగోలు చేయాల్సిన పరిస్థితులు ఉంటున్నాయని ప్రజలు అంటున్నారు. ఈ బాధలు పడలేక చాలా మంది ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదనుగా భావించి వారి జేబులను ఆసుపత్రుల యాజమాన్యాలు ఖాళీ చేస్తున్నాయి. టెస్ట్‌ల పేరుతో మరింత దోచేస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని రోగులు నిట్టూర్పు వదులుతున్నారు.

ఎక్కడ చూసినా చెత్తే

ఇదిలా ఉంటే రాజానగరం, అనపర్తి నియోజకవర్గాల్లోని చాలా గ్రామాల్లో పారిశుధ్య సమస్య వేధిస్తుంది. ఎక్కడికక్కడే చెత్త తిష్ట వేస్తోంది. వర్షాల కారణంగా ఎక్కడికక్కడే నీరు నిల్వ ఉండడం, చెత్త పేరుకుపోవడంతో దోమలు పెరిగిపోతున్నాయి. మురుగు కాలువల శుభ్రతే చాలాచోట్ల మరిచిపోయారు. బ్లీచింగ్ చల్లిన దాఖలాలు ఎక్కడా కనిపించడం లేదు. పంచాయతీ కుళాయిల నుంచి నీరు కలుషితం సరఫరా అవుతోంది. ఎక్కడికక్కడే పైప్‌లైన్ల లీకేజీలతో ఈ సమస్యల వచ్చింది. గత ప్రభుత్వంలో ఫ్రైడే–డ్రైడే వంటి కార్యక్రమాలు నిర్వహిస్తూ గ్రామాల్లో మెరుగైన పారిశుధ్యానికి చర్యలు తీసుకునేవారు. ఇప్పుడు అదెక్కడా అమలు కావడం లేదు.

అప్రమత్తత అవసరం



సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. కాచి చల్లార్చిన నీరు మాత్రమే తాగాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. నిత్యం చేతులను శుభ్రం చేసుకోవాలి. తాజా కూరగాయలను మాత్రమే తినాలి. నిల్వ ఉన్న ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలి. జ్వర పీడితులు పీహెచ్‌సీల్లో ఆరోగ్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి. గర్భిణులు, బాలింతలు మరింత జాగ్రత్తగా ఉండాలి.

–శ్రీవల్లి, పీహెచ్‌సీ వైద్యురాలు, కోటికేశవరం

వైద్య శిబిరాలు నిర్వహించాలి



పేద, మధ్యతరగతి ప్రజలకు ప్రభుత్వ వైద్యాన్ని మెరుగుపరచాలి. అవసరమైన ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి. అన్ని రోగాలకు మందులను అందుబాటులో ఉంచాలి. ప్రభుత్వ వైద్యాన్ని పేదలకు అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకోవాలి. అలాగే గ్రామాల్లో ఆరోగ్య సురక్ష శిబిరాలను నిర్వహించి, మందులను అందజేస్తూ రోగాల రహితంగా గ్రామాలను తీర్చిదిద్దాలి.

– ఉల్లి వీరవెంకట సత్యసూర్యకుమారి, ఎంపీపీ, కోరుకొండ

సోలార్ విద్యుత్‌ను సద్వినియోగం చేసుకోవాలి



సోలార్ విద్యుత్‌పై సబ్సిడీ వివరాల బ్రోచర్ విడుదల చేస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

పెదపూడి: సబ్సిడీపై అందించే సోలార్ విద్యుత్ సౌకర్యాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రాజమహేంద్రవరం విద్యుత్ శాఖ ఈఈ శ్రీధర్, ఏడీఏ నిరంజన్‌బాబు అన్నారు. అనపర్తిలో బుధవారం వారు సోలార్ విద్యుత్‌పై సబ్సిడీ వివరాల బ్రోచర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బ్యాంక్ రుణ సౌకర్యంతో పాటు సబ్సిడీపై సోలార్ విద్యుత్‌ను అందించే ఏర్పాట్లు చేస్తుందన్నారు. సుమారు రూ.3,000 వరకూ కరెంటు బిల్లు వచ్చే ఇంటికి సోలార్ విద్యుత్‌ను అమర్చితే కేవలం రూ.230 మాత్రమే వస్తుందన్నారు. ఇంటికి సోలార్ విద్యుత్ సరిపడినంత వినియోగించుకున్న తర్వాత ఇంకా మిగిలితే దానిని ఏపీఈపీడీసీఎల్‌కి తిరిగిచ్చి సొమ్ము పొందొచ్చన్నారు.

కృష్ణాష్టమి వేడుకలు శాంతియుతంగా జరుపుకోవాలి



వడిశలేరులో గ్రామ పెద్దలతో మాట్లాడుతున్న ఎస్ఐ కృష్ణసాయి

రంగంపేట: మండలంలో కృష్ణాష్టమి వేడుకలు శాంతియుతంగా జరుపుకోవాలని ఎస్ఐ తోట కృష్ణసాయి సూచించారు. మండలంలోని వడిశలేరు గ్రామంలో బుధవారం సాయంత్రం నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకలను ఆయన సందర్శించి గ్రామ పెద్దలతో మాట్లాడారు. గ్రామాల్లో నిర్వహించే జాతరలు, ఉత్సవాలు, తీర్థాలపై ముందుగా స్థానిక పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. అలాంటి చోట్ల ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు బందోబస్తు ఏర్పాటు చేస్తామని తెలిపారు. స్థానిక ప్రజలు, పెద్దలు, కమిటీ సభ్యులు సహకరించాలని ఆయన కోరారు.

క్లుప్తంగా

పారిశుధ్యం మరింత మెరుగుపరచాలి

పెదపూడి: గ్రామాల్లో పారిశుధ్యం మరింత మెరుగుపరచాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎం.సత్యనారాయణరెడ్డి అన్నారు. స్వచ్ఛ వారోత్సవాల్లో భాగంగా బుధవారం మండలంలోని జి.మామిడాడ, పెద్దాడ గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య చర్యలు చేపట్టారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సిబ్బందికి సూచించారు. మురుగు గుంటల్లో నీటిని తొలగించి బ్లీచింగ్ చల్లించాలన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి ఆరోగ్యశాఖ సిబ్బంది, పంచాయతీరాజ్ అధికారుల సూచనలు పాటించాలన్నారు. ప్రజలు తప్పనిసరిగా కాచి చల్లార్చిన నీటినే తాగాలన్నారు. కార్యక్రమంలో పలువురు సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

లక్ష్మీగణపతిని దర్శించుకున్న ఆర్డీవో



బిక్కవోలు లక్ష్మీగణపతి స్వామి ఆలయంలో ఆర్డీఓ లక్ష్మీశివజ్యోతి

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలులో కొలువైన శ్రీలక్ష్మీగణపతి ఆలయంలో స్వామివారిని రాజమహేంద్రవరం ఆర్డీఓ కె.లక్ష్మీశివజ్యోతి బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆమెకు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి ఆలయ చరిత్ర వివరించారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనాలు అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమణి, డిప్యూటీ తహసీల్దార్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సారా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

రంగంపేట: సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్టు ఎస్ఐ తోట కృష్ణసాయి తెలిపారు. బుధవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని మర్రిపూడి గ్రామంలో తనిఖీలు నిర్వహించగా గ్రామ శివారులో పీతా వీరవెంకటరమణ సారా విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకుని, అతని వద్ద నుంచి 5 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. మండలంలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

కోరుకొండలో కుక్కల బెడద

మధురపూడి: కోరుకొండలో కుక్కల బెడద ఎక్కువైంది. కూరగాయల మార్కెట్, శివాలయం రోడ్డు, రామకృష్ణ సినిమా థియేటర్ ప్రాంతాల్లో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. ఇటీవల ఇద్దరు కుక్కకాటుకు గురయ్యారు. పంచాయతీ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

విజయవంతంగా కవి సమ్మేళనం



సమావేశంలో పాల్గొన్న సాహితీవేత్తలు

సీటీఆర్ఐ: స్థానిక సంహిత కన్వెన్షన్ హాల్‌లో రెండో రోజు కళా గౌతమి 33 వసంతాల వేడుక సందర్భంగా నిర్వహించిన కవి సమ్మేళనం విజయవంతమైంది. కళా గౌతమి వ్యవస్థాపకుడు డాక్టర్ బీవీఎస్ మూర్తి, నూతన అధ్యక్షుడు డాక్టర్ పీవీబీ సంజీవరావు, కార్యదర్శి డాక్టర్ బీహెచ్‌వీ రమాదేవి నేతృత్వంలో జరిగిన ఈ సభను ప్రముఖ విద్యావేత్త జక్కంపూడి విజయలక్ష్మి ప్రారంభించారు. హైదరాబాద్ నుంచి విచ్చేసిన ప్రముఖ సాహితీవేత్త వారణాసి సుబ్రహ్మణ్యం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డాక్టర్ బీవీఎస్ మూర్తి మాట్లాడుతూ కళా గౌతమి స్థాపించిన దగ్గర నుంచి కవుల సహాయ సహకారాలు మరువలేమన్నారు. ముఖ్యంగా వారణాసి సుబ్రహ్మణ్యం సేవలు గణనీయమైనవని తెలిపారు. జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ సాహిత్యం అంటే తనకు ఎనలేని ప్రేమని, అందుకే ఇటువంటి కార్యక్రమాలకు హాజరయ్యే విధంగా చేసిందన్నారు. వారణాసి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ భాషా సాహిత్యాలపై అర్థవంతమైన చర్చలు జరగాలన్నారు. నవరాత్రి ఉత్సవాలు అంటే తొమ్మిది రాత్రి అనే అర్థం వస్తుందని, నవరాత్ర ఉత్సవాలు అనాలని అన్నారు. అనంతరం వారణాసి సుబ్రహ్మణ్యంను, తెలుగు వెలుగు కామేశ్వరరావులను సత్కరించారు. కార్యక్రమంలో పలువురు సాహితీవేత్తలు, కవులు, రచయితలు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో పండ్లు, బ్రెడ్ల పంపిణీ

పెదపూడి: ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పుట్టినరోజు సందర్భంగా స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో మాజీ సొసైటీ చైర్మన్ పుట్టా గంగాధర్ చౌదరి బుధవారం రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. అలాగే స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ రమణమూర్తి, వైద్యులు హర్షవర్ధన్, సుభాష్, రాముడు, సర్పంచ్ కలవల కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వినాయక చవితికి రాట ముహూర్తం



అనపర్తిలో వినాయక చవితికి రాట ముహూర్తం చేస్తున్న గ్రామపెద్దలు



పందలపాకలో రాట ముహూర్తం నిర్వహిస్తున్న భక్తులు

పెదపూడి: అనపర్తిలోని రావిచెట్టు వద్ద వేంచేసియున్న విజయగణపతి ఆలయం వద్ద వచ్చే నెల 7వ తేదీన నిర్వహించనున్న వినాయక చవితి ఉత్సవాలకు రాట ముహూర్తం బుధవారం చేశారు. కార్యక్రమంలో వెలగల గంగిరెడ్డి, కనకదుర్గ దంపతులు పూజలు నిర్వహించి చవితి వేడుకలకు శ్రీకారం చుట్టారు. ఆలయ వ్యవస్థాపకులు కర్రి రామారెడ్డి, ప్రతినిధులు మండ రామారెడ్డి, కర్రి సుధాకర్‌రెడ్డి, తేతలి నారాయణరెడ్డి, వీర్రెడ్డి, ఓగిరెడ్డి, సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పందలపాకలో..

బిక్కవోలు: మండలంలోని పందలపాక వెలంపేట వద్ద గణపతి నవరాత్రులకు రాట ముహూర్తం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెలంపేట రామాలయం వద్ద గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపతి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కూనిరెడ్డి సాంబశివ మాట్లాడుతూ వచ్చే నెల 7వ తేదీ నుంచి 16 వరకూ గణపతి నవరాత్రులు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సబ్బారపు పద్మావతి, కర్రి శ్రీనివాసరావు, మాజీ పంచాయతీ వార్డు సభ్యులు గొర్రిపోటి సత్యనారాయణ, యాసలపు శ్రీనివాస్, బొడ్డు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



వేపపిండి వినియోగం గురించి రైతులకు వివరిస్తున్న వ్యవసాయ అధికారులు ద్వారకాదేవి, శాంత ఆలివ్

కడియం: మేలైన యాజమాన్య పద్ధతులతో వరిలో అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ అధికారులు కె.ద్వారకాదేవి, శాంత ఆలివ్ అన్నారు. దుళ్లలోని అయిలు సుబ్బారావు వ్యవసాయ క్షేత్రంలో బుధవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రస్తుతం వరి సాగులో మితిమీరిన రసాయన ఎరువుల వినియోగం జరుగుతుందన్నారు. దీనివల్ల పంటలకు నష్టం వాటిల్లుతుందన్నారు. ఎకరాకు ఐదు కిలోల వేప పిండి వినియోగిస్తే అనేక ప్రయోజనాలు ఉంటాయన్నారు. ఈ వేప పిండిని ఒక వస్త్రంలో మూటకట్టి తగిన నీటిలో 24 గంటలు నానబెట్టిన అనంతరం 100 గ్రాముల పాల ఇంగువాను కలిపి వరిపై పిచికారీ చేయాలని సూచించారు. నారు పోసిన 15 రోజుల తర్వాత నుంచి 20 రోజుల కోసారి పొట్ట దశ వచ్చే వరకూ ఈ వేపపిండిని వరిపై పిచికారీ చేయడం వల్ల ఎలాంటి చీడ పీడలకు అవకాశం ఉండదన్నారు. రసాయనిక ఎరువులు వాడకం తగ్గిస్తే పెట్టుబడులు తగ్గుతాయని రైతులు గ్రహించాలన్నారు. సేంద్రియ యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు సాధించవచ్చని ద్వారకాదేవి అన్నారు. వేప పిండిని ఏ విధంగా కలపాలో ప్రత్యక్షంగా చూపించి వరి క్షేత్రంలో పిచికారీ చేయించారు. వేదభూమి సీఈఓ రత్నకుమారి మాట్లాడుతూ రైతులకు కేంద్ర ప్రభుత్వం, నాబార్డు ద్వారా ద్వారా అందించే పథకాలను వివరించారు. పంటల సాగులో ఎదుర్కొంటున్న ఇబ్బందులను రైతులు అధికారులకు తెలియజేశారు. సర్పంచ్ కొండపల్లి పట్టియ్య, ఉప సర్పంచ్ తోకల శ్రీనివాసరావు, మాజీ ఉప సర్పంచ్ చిక్కాల రాముడు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది అయిలు లక్ష్మణ్, రమణ తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానాన్ని బాధ్యతగా భావించండి



నేత్రదానం చేయనున్నట్లు ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న హెచ్ఎం దుర్గాప్రసాద్

కంబాలచెరువు: సమాజంలో ప్రతి ఒక్కరూ నేత్రదానాన్ని బాధ్యతగా స్వీకరించాలని డాక్టర్ మర్రా ఇందిర అన్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ, కుటుంబ సంక్షేమ శాఖ సంయుక్తంగా నిర్వహిస్తున్న 39వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా స్థానిక కంటిపూడి రామారావు నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో అవగాహన శిబిరం ఏర్పాటు చేశారు. డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ లావణ్య ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు ఇందిర తెలిపారు. నేత్రదానంపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. నేత్రదానం మనిషి మరణానంతరం మరో ఇద్దరికి చూపును ప్రసాదిస్తుందన్నారు. కంటిపూడి రామారావు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పులుగుర్త దుర్గాప్రసాద్ మాట్లాడుతూ నేత్రదానానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. తాను మరణానంతరం నేత్రాలను దానం చేయనున్నట్లు ప్రకటించి, ధ్రువీకరణ పత్రాన్ని డాక్టర్ ఇందిరకు అందజేశారు. అనంతరం విద్యార్థులకు నేత్ర పరీక్షలు చేశారు. ఏఎన్ఎం రాజ్యలక్ష్మి, కరుణ, ఉపాధ్యాయులు ఈఎస్ భాస్కరరావు, జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.

‘మారుతీనగర్ సుబ్రమణ్యం’ యూనిట్ సందడి



శివజ్యోతి థియేటర్‌లో ప్రేక్షకులతో మాట్లాడుతున్న హీరో అంకిత్ కొయ్యా, దర్శకుడు లక్ష్మణ్‌కార్య, హీరోయిన్ రమ్య

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ‘మారుతీనగర్ సుబ్రమణ్యం’ సినిమాను ఆదరిస్తున్న ప్రేక్షకులకు చిత్ర యూనిట్ ధన్యవాదాలు తెలిపింది. నటులు రావు రమేష్, ఇంద్రజ ప్రధాన పాత్రలో రూపొందిన మారుతీనగర్ సుబ్రమణ్యం చిత్ర యూనిట్ విజయ యాత్రలో భాగంగా స్థానిక శివజ్యోతి థియేటర్‌కు బుధవారం సాయంత్రం వచ్చింది. లక్ష్మణ్‌కార్య రచన, దర్శకత్వం వహించిన ఈ సినిమాలో రావు రమేష్, అంకిత్ కోయ, ఇంద్రజ, రమ్య పసుపులేటి, అజయ్, హర్షవర్ధన్, శివన్నారాయణ, అన్నపూర్ణ, ప్రవీణ్ తదితరులు నటించారు. డైరెక్టర్ సుకుమార్ భార్య తబిత సుకుమార్ సమర్పణలో బుజ్జిరాయుడు పెంట్యాల, మోహన్ కార్య నిర్మించారు. వర్ధమాన నటుడు అంకిత్ కొయ్యా, నటి రమ్య పసుపులేటి, డైరెక్టర్ లక్ష్మణ్ కార్యలు ప్రేక్షకులతో కలిసి సందడి చేశారు. సినిమాలోని ఒక పాట చరణం పాడడంతో ప్రేక్షకులు కూడా గొంతు కలిపారు. తమకోసం వెయిట్ చేసిన గాయత్రీ కాలేజీ విదార్థులకు అంకిత్ కృతజ్ఞతలు చెబుతూ కాలేజీ ఫ్రెషర్స్ డేకి వస్తానని హర్షధ్వానాల మధ్య ప్రకటించాడు. ఈ సినిమాలో అకౌంట్‌లో పది లక్షలు వేసినట్లే ప్రేక్షకుల్లో ఒకరిని సెలక్ట్ చేసి అక్కౌంట్‌లో డబ్బులు వేస్తామన్నారు. తొలుత వారికి సినిమా పంపిణీ చేసిన మైత్రి ఫిలిం డిస్ట్రిబ్యూటర్లు ఉదయ రాజు, సత్తి సత్తిరెడ్డి స్వాగతం పలికారు. అనంతరం అంకిత్ మీడియాతో మాట్లాడుతూ విశాఖకు చెందిన తాను 12 సినిమాల్లో చేసినప్పటికీ ఈ సినిమాతోనే మంచి గుర్తింపు లభించిందన్నారు.

దర్శకుడు లక్ష్మణ్‌కార్య మాట్లాడుతూ హ్యాపీ వెడ్డింగ్ సినిమా తరువాత మారుతీనగర్ సుబ్రమణ్యం రెండో సినిమాఅని, దీనిని చూసి అందరూ ఎంజాయ్ చేస్తున్నారన్నారు. మారుతీనగర్ సుబ్రమణ్యం సీక్వెల్ ఏమీ అనుకోలేదని విలేకరుల అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పారు. హీరోయిన్ పసుపులేటి రమ్య మాట్లాడుతూ సినిమాను అన్నివర్గాల ప్రేక్షకులు అలరిస్తున్నందుకు ఎంతో ఆనందంగా ఉందన్నారు.

చవితి ఉత్సవాలకు ఎంతో ప్రాధాన్యం



పుష్కరాల రేవు వద్ద చవితి ఉత్సవాలకు రాట ముహూర్తంలో పాల్గొన్న జక్కంపూడి రాజా

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు రాజా

ప్రకాశంనగర్: రాజమహేంద్రవరం పుష్కర ఘాట్ వద్ద ఏటా నిర్వహించే వినాయక చవితి ఉత్సవాలకు ఎంతో ప్రాధాన్యం ఉందని, ఈ ఏడాది కూడా అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నామని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. బుధవారం స్థానిక పుష్కరాల రేవు వద్ద రాజమహేంద్రవరం గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వినాయక చవితి ఉత్సవాలకు రాట ముహూర్తం చేశారు. దీనికి రాజా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 13 ఏళ్లుగా గణేష్ ఉత్సవాలను ఎంతో ఘనంగా నిర్వహిస్తున్నామని అన్నారు. వచ్చే నెల 7న వినాయక చవితి రోజు నుంచి స్వామివారి నవరాత్ర ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. పూజా కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో బైరాజు ప్రసాద్‌రాజు, శ్రీకన్యరాజు, కొమ్ముల సాయి, కరుణామయుడు శ్రీను, నీడిగట్ల బాబ్జీ, కోట, బోస్, అడపా అనిల్ తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాలతోనూ ఆదాయం పొందండి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

కడియం: పూల వ్యర్థాల నుంచి అదనపు ఆదాయాన్ని పొందాలని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. బుధవారం సాయంత్రం కలెక్టర్ చాంబర్‌లో కడియం పూల మార్కెట్ అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హోల్‌సేల్ పూల మార్కెట్ నిర్వాహకులు నిత్యం ఇరిగేషన్ కాలువల్లో పూల వ్యర్థాలను వేయడం ద్వారా పరోక్షంగా పర్యావరణ కాలుష్యానికి కారకులు అవుతున్నారని తెలిపారు. ఆధునిక టెక్నాలజీని ఉపయోగించడం ద్వారా పూల వ్యర్థాల నుంచి అదనపు ఆదాయాన్ని పొందడం సాధ్యమన్నారు. అందుకు ఎన్నో సానుకూల అంశాలు అందుబాటులో ఉన్నాయని, వాటిని అధ్యయనం చేసి కొంత పెట్టుబడి పెట్టడం ద్వారా ఆదాయ వనరుగా మార్చుకోవాలన్నారు. పూల వ్యర్థాలను డీకంపోస్టు చేసి సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కింద చేయవచ్చని స్పష్టం చేశారు. కూలింగ్ ప్రాసెసింగ్ విధానం, పూలను ఎండబెట్టడం ద్వారా వాటి రంగు పోకుండా ఉండే సాంకేతిక పరిజ్ఞానం సద్వినియోగం చేసుకుని, దేశీయ విదేశీయ మార్కెటింగ్ చేసుకునే వెసులుబాటు ఉందన్నారు. పూల నుంచి అగరబత్తీలు తయారు చేసే విధానం ఉందని, దీనికోసం తక్కువ పెట్టుబడి పెట్టడం కోసం ముందుకు రావాలని కలెక్టర్ సూచించారు. గులాబీల, ఇతర సుగంధ పూల నుంచి సుగంధ ద్రవ్యాలు తయారు చేసే పద్ధతి అభివృద్ధి చేయడంపై ముందుకు రావాలని కోరారు. జిల్లా గ్రామ పంచాయతీ అధికారి డి.రాంబాబును పూల మార్కెట్ ప్రాంతంలో ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ చేపట్టాలని కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు. అనంతరం పర్యాటక పరంగా జిల్లాలో ప్రతిపాదించిన వివిధ ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్ పనులు, భూముల వివరాలు, వాటికి రావాల్సిన పరిపాలన అనుమతులు తదితర అంశాలపై టూరిజం ఆర్డీ వి.స్వామినాయుడు, ఏపీఎంఐపీ పీడీ దుర్గేష్, డీటీఓ ఎంపీడీఓ కె.రత్నకుమారి తదితరులతో సమావేశం నిర్వహించారు. పీడీ ఏపీఎంఐపీ ఎ.దుర్గేష్, జిల్లా పంచాయతీ అధికారి డి.రాంబాబు, పూల మార్కెట్ యూనియన్ ప్రతినిధులు జి.నాగేశ్వరరావు, పి.వెంకన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

గిడుగు రామ్మూర్తికి ఘన నివాళి



గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి వేడుకలను ప్రారంభిస్తున్న అధ్యాపకులు

కంబాలచెరువు: ప్రజలకు అర్థమయ్యేలా రచనలు చేసిన గిడుగు రామ్మూర్తి పంతులు చిరస్మరణీయుడని వక్తలు కొనియాడారు. స్థానిక ఆర్ట్స్ కళాశాలలో తెలుగు శాఖ ఆధ్వర్యంలో వ్యవహారిక భాషా ఉద్యమ నిర్మాణకర్త గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెమినార్ హాల్‌లో బుధవారం జరిగింది. కళాశాల అధిపతి డాక్టర్ కె.రామచంద్రరావు మాట్లాడుతూ వ్యవహారిక భాష ఆవశ్యకతను తెలియజేశారు. తెలుగు ప్రత్యేకతలపై ప్రసంగిస్తూ కొన్ని ప్రశ్నలు వేసి సమాధానం ఇచ్చిన విద్యార్థులకు నగదు బహుమతులు ఇచ్చారు. విశిష్ట అతిథిగా, ఉపన్యాసకులుగా విచ్చేసిన ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం సహాచార్యులు తరపట్ల సత్యనారాయణ మాట్లాడుతూ తెలుగు భాష ప్రత్యేకత, భాష విస్తృతి, వ్యవహారిక భాష ఆవశ్యకతను వివరించారు. సమన్వయకర్త తెలుగు శాఖ అధిపతి డాక్టర్ పీఏ సత్యనారాయణ మాట్లాడుతూ భాషా దినోత్సవం సందర్భంగా వక్తృత్వ, వ్యాసరచన, పాటల పోటీలు నిర్వహించామని చెప్పారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. తెలుగు శాఖ అధ్యాపకులు షేక్ జరీనా బేగం, బి.సుబ్బలక్ష్మి, సముద్రాల ప్రిస్కిల్లా, జి.శ్రీనివాస్, పీవీ జగ్జీవన్‌రామ్, కే.ఎం సౌందర్యవతి తదితరులు పాల్గొన్నారు.